క్లుప్తంగా

పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం



నూతన గదులను ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో డార్మెటరీ గదుల నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన సమారిటర్స్ ఫర్ ది నేషన్ అనే స్వచ్ఛంద సంస్థ చేయూతనందించింది. పాఠశాలలోని ఐదు డార్మెటరీ గదుల నిర్మాణానికి ఈ సంస్థ ఆర్థిక సహకారమందించి నిర్మాణం చేపట్టింది. మంగళవారం నూతనంగా నిర్మించిన గదులను సంస్థ వ్యవస్థాపకులు రామ్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దేవాసింగ్, ఉపాధ్యాయులు బాలు, బాబురావు,రమేష్, హరిలాల్, సీతారామ్, రూప్లా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న చేయూత ట్రస్ట్ ప్రతినిధులు

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన గొల్లమందల రమణ అనే నిరుపేద మహిళ గుండె జబ్బుతో బాధపడుతుంది. వైద్యఖర్చులకు ఇబ్బందులు పడుతున్న ఆమెకు అదే గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ ప్రతినిధులు మంగళవారం రూ.5 వేల ఆర్థిక సాయమందించారు. భర్త చనిపోయి గుండె జబ్బుతో బాధపడుతున్న రమణకు చేయూత ట్రస్ట్ అండగా ఉంటుందని చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కె.వెంకటేశ్వర్లు, కె.నాగిరెడ్డి, జె.మల్లారెడ్డి, పి.రాజేష్, జి.నర్సిరెడ్డి, కె.రామచంద్రారెడ్డి, కె.వెంకటరెడ్డి, ఎస్.మల్లేశ్వరరావు, కె.చిన్ననాగిరెడ్డి, బి.వెంకట్రామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి భవాని తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో..

మణుగూరుటౌన్: పట్టణానికి చెందిన శ్రీనివాసరావు(వేణు) ఫ్లెక్సీ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. డయాలసిస్ కారణంగా అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతూ సతమతం అవుతుండగా.. విషయం తెలుసుకున్న మణుగూరు వాసవీక్లబ్, వనితా వైభవం ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారి దోసపాటి నాగేశ్వరరావు చేతులమీదుగా మంగళవారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి శక్తి మేరకు సాయమందించడంలో మణుగూరు వాసవీక్లబ్ ముందుంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, కేసా రాజేంద్ర ప్రసాద్, బొగ్గవరపు అంజలి, మిట్టపల్లి శ్యామ్, ఐపీసీ బండారు నరసింహారావు, జోన్ చైర్మన్ చిట్టూరి శేషుబాబు, దింటకుర్తి బ్రహ్మయ్య, చిత్తలూరి రమేశ్ బాబు, మురహరి తదితరులు ఉన్నారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

చర్ల: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలలకు పనుల ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి దాసరి సాయన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రాంతాలలో పర్యటించి అనంతరం మాట్లాడారు. పనులు చేస్తున్న కూలీలకు తాగునీరు, మెడికల్ కిట్లు, టెంట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆయన అన్నారు. వేసవి తీవ్రత పెరిగిన నేపథ్యంలో కొలతలతో సంబంధం లేకుండా పని చేస్తు ప్రతీ కూలికి రూ.800 చెల్లించాలని, ప్రతీవారం వేతనాలు కూలీల ఖాతాలలో జయ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కుటుంబానికి 100 రోజుల పని దినాలను 200 రోజులకు పెంచాలని ప్రతీ కూలికి పని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యాక్రమంలో ఉపాధిహామీ కూలీలు కొండా రణి, కొంగూరి రాజు, పర్వ తాతయ్య, కర్రి అబ్బులు, మణెమ్మ, పాముల అమరావతి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ దాతలకు సన్మానం

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలో సూదిరెడ్డి నాగిరెడ్డి ఆది లక్ష్మమ్మ మెమోరియల్ ఉన్నత పాఠశాలను ఆ పాఠశాల భవన నిర్మాణ దాతలైన సూదిరెడ్డి రామకృష్ణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి సోదరులు మంగళవారం సందర్శించారు. విద్యార్థిని విద్యార్థులతో ముచ్చటించారు. ఉన్నతమైన లక్ష్యాలు సాధించాలంటే కఠోర శ్రమ అవసరమని రామకృష్ణారెడ్డి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోల్ల వెంకటేశ్వరావు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు మొమెంటో శాలువాతో వారిని సత్కరించారు.

ఈ ఏడాదీ ఇంతేనా..?

- వర్షాకాలంలో సంద్రంలా గ్రామాలు
- పునరావాసం కల్పిస్తామన్న నాటి ప్రభుత్వం
- ఇప్పటికీ నెరవేరని హామీ
- ఈ వేసవిలో పనులు చేపడితేనే గట్టెక్కనున్న వర్షాకాలం



గోదావరి వరదలతో సున్నంబట్టి గ్రామంలో నీట మునిగిన ఇల్లు (ఫైల్)



వరద బాధితులను పరామర్శిస్తున్న అప్పటి రాష్ట్ర మంత్రి అజయ్‌కుమార్ (ఫైల్)

దుమ్ముగూడెం: ప్రతీ ఏటా వర్షాకాలం వస్తుందంటేనే మండలంలోని ముంపు ప్రాంత గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. వర్షాకాలంలో గోదావరికి వచ్చే వరదలతో ప్రతీ ఏడాది ఆస్తినష్టం, పశునష్టం, పంటనష్టం వాటిల్లుతుండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముంపు గ్రామాలైన పర్ణశాల, ఎల్‌ఎన్ రావుపేట, కాశీనగరం, సున్నంబట్టి, వర్క్‌షాపు వర్షాకాలం మూడు నెలలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకీడుస్తున్నారు.

రెండేళ్ల క్రితమే హామీ

2022 ఏడాది జూలై నెలలో వచ్చిన గోదావరి వరదలు 73.5 అడుగులు భద్రాచలం దగ్గర రాగ సున్నంబట్టి, కాశీనగరం గ్రామాలు తుడిచిపెట్టుకుపోవడం, మిగతా గ్రామాలలో భారీగా ఆస్తినష్టం సంభవించడం తెలిసిన విషయమే. అప్పటి రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వరదలతో అతలాకుతలమైన గ్రామాలను సందర్శించి సున్నంబట్టీ, కాశీనగరం గ్రామాల ప్రజలకు మైదాన ప్రాంతాలలో పునరావాసం కింద స్థలం కేటాయించి ఇళ్ల నిర్మాణం చేపట్టి అందజేస్తామని హామీని ఇచ్చారు.ఆ హామీ ఇచ్చి మరో దఫా వరదలు సైతం వచ్చిపోయాయి కానీ హామీ మాత్రం నేరవేరలేదు. తరువాత జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఆ వాగ్దానం మరుగున పడింది.

బ్యాక్ వాటర్‌తో ముప్పు..

గోదావరిపై నిర్మిస్తున్న సీతమ్మసాగర్ బహుళార్థక సాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో సున్నంబట్టి, కాశీనగరం గ్రామాలు తుడిచిపెట్టుకుపోయే పరిస్థితులు కనపడుతున్నాయి.గతంలో వచ్చిన గోదావరి వరదలకు ఎటువంటి పరిస్థితులు ఉద్భవించాయో కళ్లారా చూసిన ఆయా గ్రామాల ప్రజలు వర్షాకాలం అంటేనే కళ్లల్లో కొవ్వొత్తులు పెట్టుకుని చూసే పరిస్థితులు కనపడుతున్నాయి. సీతమ్మ సాగర్ బ్యాక్ వాటర్ వలన ముంపుకు గురి కాకుండా సున్నంబట్టి నుంచి చర్ల మండలం వరకు భారీ కరకట్టను నిర్మిస్తుండటంతో ఇక గ్రామాలు మునిగే పరిస్థితులు రావని అధికారులు ప్రజలకు చెబుతున్నారు. కానీ సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులను కేంద్ర పర్యావరణ అనుమతులు లేవని నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆదేశాలు రావడంతో గత కొంత కాలంగా ప్రాజెక్టు నిర్మాణ పనులు, కరకట్ట పనులు, కాంక్రీట్ గోడ నిర్మాణ పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయిన పరిస్థితులు ఉన్నాయి. మరి కొన్ని నెలల్లో వర్షాకాలం ప్రారంభమవుతుంది. వర్షాకాలం ప్రారంభమైందంటేనే ఇక్కడి ప్రజల గుండెల్లో రైళ్ళు పరుగెడుతుంటాయి. ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు వచ్చిన ఈ వర్షాకాలం నాటికి కరకట్ట, కాంక్రీట్ గోడ నిర్మాణ పనులు పూర్తి కావడం అనేది అసంభవం అంటే మరోసారి గోదావరికి వచ్చే వరదలకు ప్రజలు ఇబ్బంది పడాల్సిందే అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఈ ప్రభుత్వమైనా స్పందించేనా..?

ప్రతీ ఏటా గోదావరికి వచ్చే వరదలతో తీవ్రంగా నష్టపోతున్న ముంపు ప్రాంత గ్రామాల ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. వరదల సమయంలో ఇళ్ల, పశుసంపద, పంటలు కొట్టుకుపోతుండటంతో ప్రజలు ఆర్థికంగా బాగా దెబ్బతింటున్నారు. వరద సహాయంగా ప్రభుత్వాలు ప్రకటించే నష్ట పరిహారం అరకొర నిధులు ఎటు పక్కకు సరిపోక ప్రజలు అప్పులు తెచ్చుకుని మళ్లీ ఇళ్లు కట్టుకోవాల్సిన పరిస్థితులు కళ్ల ముందు కనపడుతున్నాయి.భద్రాచలం చుట్టూ కరకట్ట కట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించి పనులు చేపట్టిన విధంగానే మండలంలోని ముంపు ప్రాంత ప్రజలకు వరదల సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ప్రభుత్వమైన మండలంలోని వరద ముంపు ప్రాంత ప్రజలకు వరద భారీన పడకుండా రక్షణ చర్యలు చేపడతారా..లేక మైదాన ప్రాంతాలలో ఇళ్ళు నిర్మించి ఇచ్చి శాశ్వత పరిష్కారం చూపుతారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

వరదల నుంచి రక్షించండి



ప్రతి ఏటా గోదావరి వరదలతో అనేక ఇబ్బందులు పడుతూ ఆర్థికంగా నష్ట పోతున్నాం. పాలకులు మా బాధను అర్థం చేసుకుని గోదావరి వరదల భారీన పడకుండా తగిన చర్యలు తీసుకుని ప్రజలకు రక్షణ కల్పించాలి. వర్షకాలం మూడు నెలలు నిద్ర లేని రాత్రులు గడపాల్సి వస్తుంది ఆ బాధలను నుంచి విముక్తి కలిగించండి.

– నల్లగర్ల ప్రభాకర్, సున్నంబట్టి

మండలంలో ఎమ్మెల్యే పర్యటన



గండుగులపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: మండలంలో పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సోమవారం ఉదయం గండుగులపల్లి గ్రామంలో కాలినడకన పర్యటించిన ఎమ్మెల్యే, పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రజలతో నేరుగా ముచ్చటించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గుండెపట్వారిగూడెం, తొట్టిపంపు, మల్లారం కాలనీ, దమ్మపేట గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. ఇటీవలే మృతి చెందిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దమ్మపేట గ్రామంలో బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అశోక్

చండ్రుగొండ: అర్హులైన వారు పని అడిగితే ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం పనులు కల్పిస్తామని ఎంపీడీఓ అశోక్ అన్నారు. మండలంలోని రావికంపాడు గ్రామంలో ఈజీఎస్ పథకం ద్వార చేపట్టిన రోడ్డునిర్మాణం, కాలువల్లో పూడికతీత పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ఉపాధి పనుల్లో ప్రతి రోజు 2 వేల మంది కూలీలు పాల్గొంటున్నారని తెలిపారు. రోజువారి కూలి రూ.270 పడుతుందని తెలిపారు.

రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

ములకలపల్లి: ములకలపల్లి రైతువేదికలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించారు. 'రైతునేస్తం'కార్యక్రమంలో బాగంగా 'సమగ్ర వ్యవసాయం', 'డ్రోన్లతో వ్యవసాయం' అనే అంశాలపై ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.గోవర్ధన్, డాక్టర్ ఎస్.రామగోపాల వర్మ అన్నదాలకు వివరించారు. ప్రధానంగా రైతుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేశారు. అశ్వారావుపేట ఏడీఓ అఫ్జల్‌బేగం, ములకలపల్లి ఎంఏఓ కరుణామయి, డివిజన్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు యాజమాన్యానిదే బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో గత నెల రోజులుగా జరుగుతున్న ప్రమాదాలకు యాజమాన్యమే బాధ్యత వహించాలని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు అన్నారు. మంగళవారం పీవీకాలనీలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మణుగూరు ఏరియాలో గత కొంతకాలంగా సేఫ్టీ కమిటీ నిర్వహించడం లేదని పలు సాకులతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఎప్పటి నుంచో మణుగూరు ఓసీ, పీకే ఓసీ, కేపీయూజీ, ఇతర డిపార్ట్‌మెంట్లలో అధికారులకు సేఫ్టీ కమిటీలు నిర్వహించాలని ఐఎన్‌టీయూసీ చెబుతున్నా యాజమాన్యం స్పందించడం లేదన్నారు. పీకేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసరు నిర్లక్ష్యపు సమాధానం బదులిస్తున్నారన్నారు. అధికారులకు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల భద్రతపై లేదన్నారు. కార్మికులు తక్కువగా ఉన్నారనే సాకును వీడి ఇకనైనా భద్రత దృష్ట్యా సేఫ్టీ కమిటీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు గట్టయ్య యాదవ్, రాములు, షాబుద్దీన్, జయరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రదానం

దమ్మపేట: మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి మరణించగా, కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను ఖమ్మంలోని నేత్ర నిధికి దానం చేశారు. మొద్దులగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి దొడ్డా రమేష్ తండ్రి వెంకటేశ్వరరావు అనారోగ్య కారణాల వలన ఆదివారం మృతి చెందారు. మృతుడి కుమారుడు దొడ్డా రమేష్, ఖమ్మంలోని నేత్ర నిధికి, తన తండ్రి నేత్రాలను దానం చేయనున్నామని తెలిపారు. వెంటనే ఖమ్మం నుండి నేత్ర నిధికి చెందిన వారు మొద్దులగూడెం చేరుకుని మృతుడి నేత్రాలను సేకరించి, తగు భద్రతలతో ఐ బ్యాంకుకు తరలించారు. సామాజిక స్పృహతో నేత్రదానం చేసి, ఇద్దరు అంధుల చూపుకు కారణం అయిన మృతుడి కుటుంబ సభ్యులకు మండల వాసులు అభినందనలు తెలిపారు.

మిత్రుడికి బియ్యం వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల కాలనీ గ్రామానికి చెందిన జెట్టి సురేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగాయి. సురేష్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తూ ప్రస్తుతం ఆర్థిక ఇబ్బంది పడుతుండటంతో తోటి ఆటో డ్రైవర్లు మంగళవారం సురేష్‌ను పరామర్శించి 25 కేజీల బియ్యం వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

అశ్వాపురం: హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌లో డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలానికి చెందిన పలువురు బీఎస్పీ నాయకులు మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీఎస్పీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగవతపు సతీష్, ఇసంపల్లి శివకుమార్‌తో పాటు పలువురు నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బహుజనవాదం, తెలంగాణ వాదం కలిసి రాబోయే రోజుల్లో అణగారిన వర్గాల వారికి సామాజిక న్యాయం జరగాలని కోరుకుంటున్నామన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలను నిర్వహించి భక్తులకు దర్శనం కలిగించారు. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయానికి వచ్చిన వారికి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యతోనే మానసిక ఎదుగుదల



చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: విద్యార్థులకు సరైన విద్య అందినప్పుడే వారిలో మానసిక ఎదుగుదలతో పాటు సంఘానికి, కుటుంబానికి పేరు ప్రఖ్యాతలు వస్తాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సుందరయ్యనగర్‌లోని బ్రైట్‌మైండ్స్ ప్లేస్కూల్‌లో జరిగిన వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్య ఇంటి నుంచి తల్లిదండ్రుల నుంచే ప్రారంభమవ్వాలని అలాంటి పిల్లలు క్రమశిక్షణతో ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, గుడిపూడి కోటేశ్వరరావు, గాండ్ల సురేశ్, కొర్స ఆనంద్, అబ్దుల్లా, మహబూబ్ విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొంత స్థానాలకు పంపాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం గిరిజన బీఈడీ కళాశాల ఎంతో కాలంగా అక్రమ డిప్యూషన్‌పై కొనసాగుతున్న అధ్యాపకులను వెంటనే వారి సొంత స్థానాలకు పంపాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ కోరారు. ఈ మేరకు స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్‌కు వినతి పత్రం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం అధ్యాపకుల డిప్యూటేషన్ రద్దు అయిందని, కాని కొందరు అధ్యాకులు ఆశ్రమ పాఠశాలలకు వెళ్లకుండా బీఈడీ విద్యార్థులకు వచ్చిరాని బోధన చేస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. పాఠ్యాంశాలపై పూర్తి స్థాయి అవగాహ లేని అధ్యాపకులు చెపుతున్న పాఠాలు అర్థం కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాకతీయ యూనివర్సిటీ నామ్ ప్రకారం అర్హులైన అధ్యాపకులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని, లేని పక్షంలో రిటైర్డ్ ఉపాధ్యాయులను నియమించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ముత్తవరపు జానకిరామ్, చాప నాగేంద్రబాబు, ముక్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై ఎంపీపీ అసహనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి

అశ్వారావుపేటరూరల్: అభివృద్ధి పనులు, అధికారిక సమావేశాల్లో అధికారులు ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నారంటూ స్థానిక ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో జరిగే అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపన కార్యక్రమాలకు ఎంపీపీ హోదాలో ఉన్న తనకే కనీస సమాచారం అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో లేని విధంగా అధికార యంత్రాంగం ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికలను సమావేశంలో వివరించగా, దీర్ఘకాలిక సమస్యలపై పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. సమావేశంలో ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు, ఎంపీఓ సీతారామరాజు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అఖిలపక్షం వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష పార్టీల నాయకులు

ములకలపల్లి: ములకలపల్లి మండలకేంద్రంలో డ్రెయినేజీతోపాటు విద్యుత్‌లైన్ల షిఫ్టింగ్, బస్టాండ్, మూత్రశాలల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. గండుగులపల్లిలోని స్వగృహంలో మంగళవారం ఎమ్మెల్యేను కలసి, స్థానిక సమస్యలను విన్నవించారు. ములకలపల్లిలో సెంట్రల్ లైటింగ్ పనులు జరుగుతున్నాయని, డ్రెయినేజీ కూడా నిర్మిస్తే మురుగునీటి సమస్య తీరుతుందని వివరించారు. 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లు మార్పిడి చేపట్టాలని, బస్టాండ్ నిర్మించాలన్నారు.

వివిధ పనులు నిమిత్తం మండలకేంద్రానికి వచ్చే మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, వీరికోసం టాయిలెట్లు నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరీకి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ మండల నాయకులు పువ్వాల మంగపతి, డాక్టర్ గోపి, శనగపాటి అంజి, టీఆర్‌ఎస్ నాయకులు శనగపాటి సీతారాములు, వర్తక సంఘ నాయకులు కొడుకూరి వీరగోపాల్, వామపక్ష పార్టీల నాయకులు నరాటి ప్రసాద్, నూపా భాస్కర్, ముదిగొండ రాంబాబు, పువ్వాల లలితారావు, ఊకంటి రవి, కల్లూరి కిషోర్ తదితరులు ఉన్నారు.

కొత్త నిబంధన సరికాదు

భద్రాచలంటౌన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల అన్ని రకాల సెలవుల మంజూరు, నియంత్రణల విషయంలో రెండు రోజుల ముందే హెచ్‌ఎం సంతకాలతో గూగుల్ షీట్‌లో పంపాలనే కొత్త నిబంధనను గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సమీక్షించుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుటారి రాజు అన్నారు. స్థానిక టీపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన సంక్షేమ పాఠశాలలు చాలావరకు పే సెంటర్‌కు దూరంగా ఉన్నాయని, పాఠశాల నిర్వహణ సమయం అరగంట తేడాతో సుమారు అన్ని పాఠశాలలకు ఒకే విధంగా ఉంటుందని, అటువంటప్పుడు సెలవు చీటీ మీద పే సెంటర్ హెచ్‌ఎమ్ సంతకం చేయించడం ఎలా సాధ్యం అవుతుందన్నారు. ఇప్పటికైనా ఆశ్రమ ఉపాధ్యాయులకు అన్ని రకాల సెలవులపై సమీక్షించి ఉపాధ్యాయులపై ఒత్తిడి లేకుండా బోధనలో నిమగ్నమయ్యే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యులు మునిగడప రామాచారి, టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణబాబు, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

బోరు వేశారు.. కనెక్షన్ మరిచారు!



వాటర్ ట్యాంక్‌కు కనెక్షన్ ఇచ్చేందుకు తవ్విన పైప్‌లైన్ కాలువ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నందిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని కుడుములపాడు గిరిజన గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కొద్ది నెలల క్రితం బోరు వేశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు మిషన్ భగీరథకు అదనంగా అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోటా కింద సుమారు రూ.4 లక్షల వ్యయంతో బోరు, మెటారు, పైపులైన్ కోసం నిధులు కేటాయించారు. ఈ నిధులతో నూతన బోరు నిర్మాణం పూర్తి కాగా, మెటారు సైతం అమర్చారు.

అలాగే పక్కనే ఉన్న వాటర్ ట్యాంకు వరకు పైపులైను కోసం కాలువ సైతం తవ్వించారు. కానీ ఈ కాలువలో పైపులైను వేసి మెటారు నుంచి వాటర్ ట్యాంకుకు కనెక్షన్ మాత్రం ఇవ్వకుండా వదిలేశారు. దాదాపు ఇరవై రోజులు దాటుతున్న సంబంధిత అధికారుల, కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ లక్ష్మి వివరణ కోసం ప్రయత్నించగా ఆమె ఫోన్ అందుబాటులోకి రాలేదు. ఈ విషయాన్ని స్థానిక ఎంపీడీఓ జి.శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా, దీనిపై చర్యలు తీసుకుంటానని అన్నారు.